క్లుప్తంగా

నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు

ఐనవోలు / ధర్మసాగర్ : ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణకు ఐనవోలు మండల కేంద్రంలోని రైతు వేదికలో, ధర్మసాగర్ మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాట్లు చేసినట్లు ఎంపీడీఓలు నర్మద, అనిల్‌కుమార్ తెలిపారు. గురువారం ఉదయం 10.30 నుంచి 5 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తామని పేర్కొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈ నెల 9న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. గోకుల్‌నగర్ ఫీడర్‌లోని విద్యానగర్, ప్రెసిడెన్సీ స్కూల్ ప్రాంతాల్లో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, ఆర్ట్స్ కళాశాల ఫీడర్‌లోని శాంతినగర్, సుబేదారి, పోస్టల్ కాలనీ, ఎక్సైజ్ కాలనీ, అదాలత్ కూడలి ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

17న కామర్స్ టాలెంట్ టెస్ట్

హన్మకొండ: హనుమకొండ నయీంనగర్‌లోని వాగ్దేవి డిగ్రీ, పీజీ కళాశాల (స్వయం ప్రతిపత్తి)లో ఈనెల 17న కామర్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించనున్నట్లు ఆ కళాశాల కామర్స్ డిపార్ట్‌మెంట్ హెడ్ దత్తాత్రేయులు తెలిపారు. ఈ పరీక్షలో వాణిజ్యం, అకౌంటింగ్, ఎకనామిక్స్, కరెంట్ అఫైర్స్‌లలో 100 బహుళ, ఎంపిక ప్రశ్నలు ఉంటాయని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు అర్హులని తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఆకర్షణీయమైన బహుమతులు ప్రదానం చేయనున్నట్లు వివరించారు. ఆసక్తి గల విద్యార్థులు రూ.20 చెల్లించి తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 98499 40092, 98499 40092 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని దత్తాత్రేయులు కోరారు.

ఆరోపణలు మానుకోవాలి

ఖిలా వరంగల్: అసత్య ఆరోపణలతో పబ్బం గడుపుకోవాలని తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ చూస్తోందని, ఇలాంటి ఆరోపణలను వెంటనే మానుకోవాలని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంటా రవికుమార్ అన్నారు. శివనగర్‌లోని స్వగృహంలో ఆయన బుధవారం మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకుల మాటలు నమ్మే పరిస్థితిలో తెలంగాణ సమాజం లేదన్నారు.

డీజీపీ శివధర్‌రెడ్డికి ధనమైసమ్మ చిత్రపటం బహూకరణ

ఖిలా వరంగల్: ఇటీవల బాధ్యతలు చేపట్టిన రాష్ట్ర డీజీపీ శివధర్‌రెడ్డిని హెడ్ కానిస్టేబుల్, శివనగర్ ధనమైసమ్మ దేవాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు తోట బాబన్న బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డీజీపీకి ధనమైసమ్మ చిత్రపటం, తీర్థప్రసాదాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. డీజీపీని కలిసిన వారిలో ఆలయ కమిటీ ప్రతినిధులు పోపా రాష్ట్ర అధ్యక్షుడు శామంతుల శ్రీనివాస్, బిల్ల రాజు, బజ్జూరి అంజయ్య తదితరులు ఉన్నారు.

ఎంబీబీఎస్ సీట్లు సాధించిన గురుకుల విద్యార్థులు


తేజస్విని


శ్రీకాంత్

హనుమకొండ: కాజీపేట మండలం రాంపూర్ గ్రామానికి చెందిన కందుకూరి అజయ్ – సుమలత దంపతులు కూలీపనులు చేసుకుంటూ తమ కుమారుడు శ్రీకాంత్‌ను సాంఘిక సంక్షేమ పాఠశాలలో చదివించారు. శ్రీకాంత్ నీట్‌లో ఉత్తమ ర్యాంక్ సాధించి ఆసిఫాబాద్ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సీటు సాధించాడు, అదేవిధంగా రాంపూర్ గ్రామానికి చెందిన కందుకూరి సురేష్ – అన్నపూర్ణ దంపతుల కుమార్తె తేజస్విని ధర్మసాగర్ గురుకులంలో చదివి, వరంగల్ కాకతీయ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్‌లో సాధించింది. ఈ సందర్భంగా ఆ విద్యార్థులను పలువురు అభినందించారు.

శరీర దానానికి ముందుకు రావాలి



కాజీపేట అర్బన్: మరణానంతరం శరీర దానానికి ప్రతిఒక్కరూ ముందుకు రావాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు కోరారు. కాజీపేట మండలం కడిపికొండ గ్రామానికి చెందిన సెయింట్ జార్జ్ హైస్కూల్ కరస్పాండెంట్ ఆర్‌కె.బాలకృష్ణ తన మరణాంతరం పార్థివ దేహాన్ని కేఎంసీకి అందజేస్తానని అంగీకరించారు. ఈ మేరకు కేఎంసీ, సదాశయ ఫౌండేషన్ అందజేసిన పత్రాలను తన కార్యాలయంలో బాలకృష్ణకు ఎమ్మెల్యే బుధవారం అందజేసి అభినందించారు. సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు శ్రవణ్‌కుమార్, పాల కుమారస్వామి, దళపతి పాల్గొన్నారు.

సర్కారు బడుల్లో సమస్యలు..


నాచుపట్టిన పాఠశాల భవనం


జెడ్పీహెచ్ఎస్‌లో అసంపూర్తిగా నిలిచిన కిచెన్‌షెడ్లు నిర్మాణం

- అసంపూర్తిగా కిచెన్‌షెడ్లు, మరుగుదొడ్ల నిర్మాణ పనులు
- పెయింట్ వేయకపోవడంతో దెబ్బతింటున్న భవనాలు
- మనఊరు– మనబడిలో పనులు చేసినా ఇంకా తొలగని పలు సమస్యలు


పాఠశాల సమీపంలో ఏపుగా పెరిగిన చెట్లు

ధర్మసాగర్ : మండలంలోని పెద్దపెండ్యాలలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు సమస్యలతో సతమతమవుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో మన ఊరు– మనబడిలో భాగంగా పాఠశాలల మరమ్మతుకు రూ.11 లక్షల నిధులు మంజూరు అవగా సంబంధిత కాంట్రాక్టర్ నిబంధనల మేరకు పనులు పూర్తిచేశాడు. అయితే మన ఊరు–మన బడి పథకం పరిధిలోకి రాని పనులు అలాగే ఉండిపోవడంతో ఆ పాఠశాలలకు సమస్యలు తొలగిపోలేదు. పూర్తిచేసిన పనులకు ఇప్పటి వరకు ప్రభుత్వం కేవలం రూ.5 లక్షలు మాత్రమే బిల్లులు చెల్లించిందని మిగతా బిల్లులు పెండింగ్‌లోనే ఉన్నాయని సంబంధిత కాంట్రాక్టర్ మొరపెట్టుకుంటున్నాడు. ఇదిలా ఉండగా మరో కాంట్రాక్టర్ చేపట్టిన మధ్యాహ్న భోజనం కిచెన్ షెడ్లు నిర్మాణ పనులు మధ్యలోనే నిలిపివేయడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే టాయిలెట్స్ కూడా అసంపూర్తిగా నిర్మించారని, పాఠశాల వెనకభాగంలో ప్రహరీ నిర్మించకపోవడంతో సమీపంలో ఏపుగా పెరిగిన చెట్లలో నుంచి విషపురుగులు పాఠశాల గదులలోకి ప్రవేశిస్తున్నాయని విద్యార్థులు భయాందోళన చెందుతున్నారు. అదే విధంగా పాఠశాల భవనాలకు పెయింట్ వేయకపోవడంతో నాచుకట్టి భవనాలు దెబ్బతినే ప్రమాదం ఉందని, గోడలు, స్లాబు దెబ్బతింటున్నాయని ఉపాధ్యాయులు, విద్యార్థులు మొరపెట్టుకుంటున్నారు. జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలకు సంబంధించిన కిచెన్‌షెడ్లు అసంపూర్తిగా ఉందని అంటున్నారు. అదే విధంగా అంగన్‌వాడీ భవనం శిథిలావస్థకు చేరుకుందని, నేలమట్టమయ్యే ప్రమాదం ఉందని, వెంటనే సమస్యలు పరిష్కరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు సైతం కోరుతున్నారు. ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

బిల్లులు చెల్లించాలి



పెద్దపెండ్యాల ప్రాథమిక పాఠశాల మరమ్మతు పనులకు గత ప్రభుత్వం మన ఊరు–మనబడి ద్వారా రూ.11 లక్షలు మంజూరు చేసింది. ప్రభుత్వం ఆదేశానుసారం అప్పులు చేసి పనులన్నీ పూర్తిచేశాను. ఇప్పటివరకు ఐదు లక్షలు మాత్రమే చెల్లించారు. అప్పులకు వడ్డీలు చెల్లిస్తూ ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాను. పెండింగ్ బిల్లులు చెల్లించాలి.

– జిట్టా కుమారస్వామి, కాంట్రాక్టర్

సమస్యలు ఇంకా ఉన్నాయి



పాఠశాలలో సమస్యలు పేరుకుపోయాయి. క్లాస్ రూమ్‌లలోకి విషపురుగులు వస్తున్నాయి. తక్షణమే పాఠశాల వెనకభాగంలో ప్రహరీ నిర్మించి చెట్లను తొలగించాలి. అసంపూర్తిగా ఉన్న కిచెన్‌షెడ్లు, టాయిలెట్స్ నిర్మాణ పనులు పూర్తిచేయాలి. పాఠశాలకు పెయింట్ వేయించాలి. విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

– భగవాన్‌రెడ్డి, ఎంపీపీఎస్ హెచ్‌ఎం

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

- ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులు


విద్యార్థులను పరిచయం చేసుకుంటున్న ఎంపీడీఓ ఆంజనేయులు

పరకాల : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులు సూచించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం మండలస్థాయి క్రీడోత్సవాలు జరిగాయి. ఈ క్రీడలకు ఆయన హాజరై విద్యార్థులను పరిచయం చేసుకుని అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే చదువుతో పాటు క్రీడాల్లో పోటీతత్వం అలవర్చుకోవాలని అన్నారు. అప్పుడే భవిష్యత్‌లో ఏలాంటి సమస్యనైనా ఎదుర్కునే శక్తివంతులుగా తయారవుతారని అన్నారు. అనంతరం విజేతలను అభినందించారు. ఎంఈఓ రమాదేవి, ప్రధానోపాధ్యాయులు సాంబయ్య, మధు, సురేందర్, ఎఫ్ఏసీ హెచ్‌ఎంవీ భాస్కర్, ఎస్‌జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ సాంబయ్య, పీడీ, పీఈటీలు శ్యామ్, రజిత, వినయ్, సుధీర్, రాజు, శ్రీకాంత్, సురేశ్ పాల్గొన్నారు.

ఓటు చోరీని ఆపాలని సంతకాల సేకరణ


సంతకాలు సేకరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

శాయంపేట : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఓటు చోరీకి పాల్పడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థను అణచివేయాలని చూస్తోందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి విమర్శించారు. బుధవారం కాట్రపల్లి, నూర్జహాన్‌పల్లి, సాధోనిపల్లి గ్రామాల్లో బీజేపీ ఓటు చోరీ ఆపాలంటూ సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా బుచ్చిరెడ్డి మాట్లాడుతూ.. బీజేపీ అధికార దుర్వినియోగానికి పాల్పడుతుందని, దీనిపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆధారాలతో అలుపెరుగని పోరాటం చేస్తున్నారన్నారు. ప్రజాస్వామ్య విలువను కాపాడుకునేందుకు ప్రజలంతా కలిసికట్టుగా పోరాటం చేయాల్సిన సమయం వచ్చిందన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించి గ్రామాలను మరింత అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లాలని ప్రజలను కోరారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు చంద్రప్రకాశ్, శ్రీనివాస్‌రెడ్డి, చక్రపాణి, రవీందర్, కుమారస్వామి, రవి, ప్రకాశ్‌రెడ్డి, రఘుపతిరెడ్డి, భాస్కర్, సదానందం, జగన్, సతీశ్, తిరుపతిరావు, రామచంద్రు తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంఘాలు ఐక్యంగా పోరాడాలి

దామెర : బీసీ సంఘాలు సంఘటితంగా పోరాడితేనే రాజ్యాధికారం సాధ్యమవుతుందని ముదిరాజ్ యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండి సతీశ్ అన్నారు. మండలంలోని ఊరుగొండలో ఆయన మాట్లాడుతూ.. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌ను కల్పించి 10 శాతం ఓసీ కులాలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కేంద్రం కల్పిస్తుందని గుర్తుచేశారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌ను బీసీ సంఘాలు వ్యతిరేకించని కారణంగా ఆరోజు రాజ్యాంగ సవరణచేసి వారికి రిజర్వేషన్ కల్పించడం జరిగిందన్నారు. ఇప్పుడు బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌కు ఓసీలు మోకాలడ్డుపెట్టడం సరికాదన్నారు. ఇప్పటికైనా బీసీ సంఘాలు, మేధావులు, యువకులు ఏకమై ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

బెల్ట్‌షాపు నిర్వాహకుల బైండోవర్

వేలేరు : మండలంలోని పలు గ్రామాలకు చెందిన పలువురు బెల్ట్‌షాపు నిర్వాహకులను బుధవారం తహసీల్దార్ హెచ్.కోమి ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై సురేశ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున బెల్ట్‌షాపుల ద్వారా మద్యం విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వార్డెన్‌పై చర్య తీసుకోవాలి

పరకాల : విద్యార్థులకు సంబంధించిన బియ్యంతో పట్టుబడిన బీసీ హాస్టల్ వార్డెన్ అందె రవిపై చర్య తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఏకు శంకర్ మాదిగ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశాడు. గతనెల 18న బీసీ బాలుర హాస్టల్‌కు సంబంధించిన బియ్యాన్ని తరలిస్తూ పట్టుబడిన వార్డెన్‌పై చర్య తీసుకోకపోవడంపై అంత్యమేమిటో అధికారులు చెప్పాల్సిన బాధ్యత ఉందని డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ స్నేహా శబరీష్‌తో పాటు బీసీ సంక్షేమ కమిషనర్, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు.

పరామర్శ



శాయంపేట : గంగిరేణిగూడెం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ శానం పరమేశ్ తండ్రి శంకరయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మాజీ జెడ్పీటీసీ నారాయణరెడ్డి బుధవారం శంకరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.

ప్రజాసంఘాల ఆధ్వర్యంలో రాస్తారోకో


ముల్కనూరులో రాస్తారోకో నిర్వహిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

ఎల్కతుర్తి : సనాతన ధర్మం పేరుతో ధర్మపీఠంపై దాడికి యత్నించిన మనువాదుల దుర్మార్గాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ప్రజాసంఘాల నాయకులు అన్నారు. బుధవారం భీమదేవరపల్లి మండలం ముల్కనూరులోని హనుమకొండ–సిద్దిపేట ప్రధాన రహదారిపై నాయకులు బైఠాయించి ధర్నా–రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. సనాతన హిందూ ధర్మం పేరుతో మతోన్మాద అడ్వొకేట్ రాకేశ్, కిశోర్ సుప్రీం కోర్టు ప్రాంగణంలోనే సీజేఐ జస్టిస్ గవాయ్‌పై దాడికి యత్నించడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం ప్రతి పౌరుడు ఐక్యంగా నిలిచి కుట్రలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ప్రజాసంఘాల నాయకులు ప్రకాశ్, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్, భిక్షపతి, సదానందం, జగదీశ్, ప్రవీణ్, తిరుపతి, చంద్రమౌళి, శేఖర్, అయిలయ్య, సురేశ్ పాల్గొన్నారు.


దామెర : మాట్లాడుతున్న కరుణాకర్

దామెర : సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై దాడికి యత్నించడం బాధాకరమని డీబీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కరుణాకర్ అన్నారు. మండలంలోని ముస్త్యాలపల్లిలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సీజేఐపై దాడికి యత్నించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఆయన వెంట నాయకులు కిరణ్, నర్సయ్య, సాంబయ్య, చిన్న ఉన్నారు.

మంత్రి పొన్నం దిష్టిబొమ్మ దహనానికి యత్నం

కేయూ క్యాంపస్: మాదిగ సామాజిక వర్గానికి చెందిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌పై మంత్రి పొన్నం ప్రభాకర్ అనుచిత వ్యాఖ్యలు చేశారని నిరసిస్తూ ఏబీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో కాకతీయ యూనివర్సిటీ రెండో గేట్ వద్ద పొన్నం ప్రభాకర్ దిష్టిబొమ్మ బుధవారం దహనానికి యత్నించగా, కేయూ పోలీసులు అడ్డుకున్నారు. వారిని అరెస్టు చేసి అనంతరం వదిలివేశారు. మంద నరేష్, అర్షం చరణ్, నందు, పవన్‌రాజు, అఖిల్, కిరణ్, సాయి, వెంకటేష్, సూర్యవిజయ్ తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిస్టులే ప్రజలకు రక్ష



ఖిలా వరంగల్: కమ్యూనిస్టులు బలంగా ఉంటేనే ప్రజలకు రక్షణ ఉంటుందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. శివనగర్‌లోని తమ్మెర భవన్‌లో పనాస ప్రసాద్ అధ్యక్షతన పార్టీ జిల్లా సమితి సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశంలో రానున్న రోజుల్లో కమ్యూనిస్టులకే భవిష్యత్ ఉంటుందని అన్నారు. సమాజంలో అన్ని వర్గాల సంక్షేమం కోసం సీపీఐ ఉద్యమిస్తోందని గుర్తుచేశారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలను ఓడించి ప్రజాతంత్ర శక్తుల గెలుపునకు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడొద్దు

- ఎస్సై పరమేశ్


మాట్లాడుతున్న ఎస్సై పరమేశ్

శాయంపేట : సైబర్ నేరాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై జక్కుల పరమేశ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో సురేఖ మండల సమాఖ్య భవనంలో ఏర్పాటు చేసిన రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సహకారంతో వలంటరీ ఇంటిగ్రేటెడ్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా ఎస్సై పరమేశ్ హాజరై మాట్లాడారు. ప్రస్తుత కాలంలో సైబర్ మోసాలు పెరిగిపోతున్నాయని అన్నారు. బహుమతులు గెలుచుకున్నారని, మీ సంబంధికులు పోలీస్ స్టేషన్‌లో ఉన్నారని, మీ వాళ్లకు ప్రమాదం జరిగిందని అనేక రకాలుగా సైబర్ నేరగాళ్లు నేరాలకు పాల్పడుతున్నారని అన్నారు. ప్రతిఒక్కరూ తమ పిల్లలు స్మార్ట్ ఫోన్ వినియోగించే విధానాన్ని గమనించి తగిన జాగ్రత్తలు చెప్పాలని అన్నారు. పిల్లలు మనీ యాప్ జోలికి వెళ్లకుండా వాటి ద్వారా వచ్చే నష్టాలను తెలియజేయాలన్నారు. సైబర్ నేరాల ద్వారా మోసపోయామని గుర్తిస్తే పోలీసులకు సమాచారం అందించాలని అన్నారు. ఇంటిగ్రేటెడ్ డెవలప్మెంట్ సొసైటీ విడ్స్ కౌన్సిలర్ మారెపల్లి క్రాంతికుమార్, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

సీపీఎం అభ్యర్థులను గెలిపించండి


ఐనవోలు : మాట్లాడుతున్న చక్రపాణి


శాయంపేట : మాట్లాడుతున్న భిక్షపతి

ఐనవోలు : స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేస్తున్న సీపీఎం అభ్యర్థులను గెలిపించి, గ్రామాల అభివృద్ధికి తోడ్పడాలని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు బొట్ల చక్రపాణి ప్రజలకు పిలుపునిచ్చారు. బుధవారం సీపీఎం మండల విస్తృతస్థాయి సమావేశం నారాయణరెడ్డి అధ్యక్షతన మండల కేంద్రంలో జరిగింది. ఈ సందర్భంగా చక్రపాణి మాట్లాడుతూ.. అన్ని వర్గాల కార్మికుల పక్షాన నిరంతరం పోరాటం చేస్తున్న సీపీఎంని ప్రజలు ఆదరించాలని కోరారు. సీపీఎం నాయకులు ఆశయాల కోసం పనిచేస్తారని, ఇతరులు అక్రమ సంపాదన, ఇతర ప్రయోజనాల కోసం పనిచేస్తారని ఆరోపించారు. అదే విధంగా ఇటీవల సుప్రీం కోర్టు సీజేఐపై జరిగిన దాడిని ఆయన ఖండించారు. దాడికి పాల్పడిన వ్యక్తిని అరెస్టు చేసి శిక్షించాలని డిమాండ్ చేశారు. మండల కార్యదర్శి కాడబోయిన లింగయ్య, దీకొండ ఉప్పలయ్య, యాకూబ్, రాంకుమార్, మహేందర్, నారాయణరెడ్డి, నాగరాజు, కవిత, గోపాల్‌రావు, హసీనా, నర్సయ్య పాల్గొన్నారు.

శాయంపేట : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఐ అభ్యర్థులను గెలిపించాలని ఆ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి తోట భిక్షపతి కోరారు. బుధవారం మండల కేంద్రంలో మండల కార్యదర్శి సదానందం అధ్యక్షతన ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించి మాట్లాడారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం, మలిదశ తెలంగాణ ఉద్యమం, నిరుపేదల కోసం భూ పోరాటాలు, ప్రజా సమస్యలపై నిత్యం పోరాడుతున్న పార్టీ సీపీఐ అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఐ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. నాయకులు రమేశ్, సాంబయ్య, కన్నయ్య, గౌసియా, కళ, రమాదేవి పాల్గొన్నారు.

బాకీ కార్డులు ఇంటింటికి అందించాలి


బాకీ కార్డులను విడుదల చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఐనవోలు : ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ప్రజలకు బాకీ పడిందని, బాకీ కార్డులు ఇంటింటికి అందించి వివరించాలని బీఆర్ఎస్ ఎన్నికల మండల ఇన్‌చార్జ్‌లు మేకల రాణి, కట్కూరి రాజు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మండలంలోని ఒంటిమామిడిపల్లి గ్రామంలో బుధవారం బీఆర్ఎస్ పార్టీ స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ముందుగా స్థానిక సంస్థల్లో పోటీ చేయాలనుకునే అభ్యర్థుల పేర్లను నమోదు చేసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడంతో ప్రజలకు బాకీ పడిందన్నారు. ఏ వర్గానికి ఎంత బాకీ పడిందో తెలియజేసే బాకీ కార్డులను గ్రామంలోని ప్రతి గడపకి బీఆర్ఎస్ శ్రేణులు అందించాలని సూచించారు. ప్రజలు బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను ఆదరించాలని కోరారు. నాయకులు సంపత్, కుమార్, సతీశ్, రమేశ్, భాస్కర్, ప్రతాప్‌రెడ్డి, సమ్మయ్య, రాజు, రాజిరెడ్డి, రాజేశ్, అశోక్, కుమార్, రాజు, రమేశ్, రాజబాబు, కుమార్, ప్రతాప్, రాజశేఖర్ పాల్గొన్నారు.

బకాయిలు విడుదల చేయాలి


మాట్లాడుతున్న కల్యాణ్

పరకాల : బెస్ట్ అవైలబుల్ స్కీం బకాయిలు విడుదల చేయకపోవడం వలన 30 వేల మంది దళిత, గిరిజన విద్యార్థులు చదువుకు దూరమయ్యే ప్రమాదం ఉందని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బొచ్చు కల్యాణ్ ఆందోళన వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో ఎస్ఎఫ్ఐ పరకాల మండల ముఖ్య కార్యకర్తల సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే బెస్ట్ అవైలబుల్ స్కీం బకాయిలు రూ.154 కోట్లు విడుదల చేసి దళిత, గిరిజన పిల్లల చదువులకు తోడ్పాటును అందించాలన్నారు. లేని పక్షంలో విద్యార్థుల పక్షాన ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఎస్ఎఫ్ఐ మండల నాయకులు మహేశ్, అన్వేష్, రాకేశ్, కృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కార్తీక మాసోత్సవానికి తరలి రావాలి


వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏసీపీ సతీశ్‌బాబు, సమితి సభ్యులు

పరకాల : వచ్చే నెల 3న కార్తీక మాసోత్సవం సందర్భంగా శ్రీకుంకుమేశ్వరస్వామి దేవస్థానంలో నిర్వహించనున్న మహారుద్రయాగ మహోత్సవానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను పరకాల ఏసీపీ సతీశ్ బాబు బుధవారం ఆవిష్కరించారు. లోక కల్యాణార్థం ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు చాలా అవసరమని, భక్తులంతా పాల్గొనాలని ఆయన కోరారు. పరకాల సీఐ క్రాంతికుమార్, దేవస్థానం చైర్మన్ రాజేశ్వర్‌రావు, మహారుద్రయాగ సమితి అధ్యక్షుడు లక్ష్మణ్, కన్వీనర్ రవి, కో కన్వీనర్ అశోక్, కోశాధికారి భద్రయ్య, ఆలయ ధర్మకర్తలు రవి, నవీన్, సత్యం, సమితి సభ్యులు పాల్గొన్నారు.